క్లుప్తంగా

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్ర పాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి



పూజలందుకున్న కుమారస్వామి

శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వైదేహి నృత్యాలయ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో వినాయకకౌత్వం, లింగాష్టకం, శివాష్టకం, ఆనందనర్తనం, ఓం నమఃశివాయ, అతిస్వరం, నవదుర్గ తదితర గీతాలకు శృతి, మీనాక్షి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి మంగళవారం కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన కృష్ణారావు రూ.1,11,116 విరాళాన్ని ఏఈఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

స్వామిత్వ పారదర్శకంగా నిర్వహించాలి



కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: స్వామిత్వ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని పాములపాడు, మిట్టకందాల, చెలిమిల్ల, వానాల, బానుముక్కల, మద్దూరు గ్రామాల్లో నిర్వహించిన స్వామిత్ర కార్యక్రమాన్ని ఎంపీడీపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 1,921 ఆస్తుల వివరాలు సేకరించి కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్లు టీంగా ఏర్పడి కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, పంచాయతీ కార్యదర్శి క్రాంతి ఉన్నారు.

సున్నిపెంట భూ అక్రమాలపై హైకోర్టులో పిల్

శ్రీశైలం ప్రాజెక్టు: సున్నిపెంట గ్రామంలోని భూ ఆక్రమణలపై రాష్ట్ర హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం పిటిషన్ నమోదైంది. సుమారు 121 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సున్నిపెంటకు చెందిన లాయరు దేవలూటి కాశీరావు పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణకు స్వీకరించి, జలవనరులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు కాశీరావు తెలిపారు.



నందికొట్కూరులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



మహానందిలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్, డీఆర్ఓ

పూజకు వేళాయె!

వాడవాడలా వెలసిన వినాయక మండపాలు

- వివిధ రూపాల వినాయక విగ్రహాలను సిద్ధం చేసి ఉంచుకున్న భక్తులు
- పూజాసామగ్రి కొనుగోలుతో కిక్కిరిసిన బజార్లు
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు

వినాయ చవితి ఉత్సవాలకు భక్తులు సిద్ధమయ్యారు. బుధవారం వినాయక చవితి కావడంతో ఇప్పటికే వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్‌దీపాలతో వీధులను అలంకరించారు. వివిధ రూపాల్లోని గణాథుల ప్రతిమలను కొనుగోలు చేసి తెచ్చిపెట్టుకున్నారు. భక్తుల పూజా సామగ్రి కొనుగోళ్లతో మంగళవారం నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాలతోపాటు ఆయా నియోజకవర్గాల్లోని మండల కేంద్రాల బజార్లు కిక్కిరిసిపోయాయి.

– ఆత్మకూరు/నందికొట్కూరు

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

ఆత్మకూరు: వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, కాకనూరు పీఠాధిపతి శ్రీశ్రీ శివయోగేంద్రసరస్వతి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఆరవేటి సంఘం అధ్యక్షుడు నరహరి సత్యనారాయణ, షేగు కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కిరణ్ జనరల్ స్టోర్ వద్ద మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత వాతావరణం మధ్య ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలకు ప్రథమ స్థానం ఉందన్నారు. చిన్న విగ్రహాలు మట్టితో తయారు చేయడం వల్ల పర్యావరణం కాపాడవచ్చని, భారీ విగ్రహాలను కూడా అదే తరహాలో తయారు చేసి పర్యావరణానికి సహకరించాలని కోరారు. అనంతరం దాదాపు వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

అనుమతులు తప్పనిసరి

నందికొట్కూరు/కొత్తపల్లి/శ్రీశైలంప్రాజెక్ట్: వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్, చంద్రబాబు సూచించారు. మంగళవారం వారు తమ తమ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో మాట్లాడారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు, ఘర్షణలు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. విగ్రహాల వద్ద రాత్రి 10 గంటలు దాటిన తర్వాత లౌడ్ స్పీకర్లు పెట్టరాదన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రశాంతంగా నిమజ్జనానికి తరలించాలన్నారు.

మహానంది: వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి ఉత్సవ కమిటీల నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపతులు



మట్టితో వినాయకులను తయారు చేస్తున్న విద్యార్థులు

మహానంది: మట్టి గణపతిని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ఇచ్చిన పిలుపుతో విద్యార్థులంతా స్వచ్ఛమైన పుట్టమట్టిని సేకరించుకుని చిట్టిచిట్టి గణనాథులను తయారు చేశారు. మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్, హెచ్ఎం చింతకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టితో గణనాథులను తయారు చేశారు. అలాగే అటవీశాఖ డీఆర్ఓ హైమావతి ఆర్థిక సహకారంతో మహానందిలో ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, గణేశ్ కేంద్ర కమిటీ సభ్యులు ఉమాదేవి, సుబ్బరామయ్య, రామచంద్రుడు, రమణయ్య పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

వెలుగోడు: వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం వాసవీ క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లోని వాసవీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ప్రజలకు 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు తాళ్లూరి రవికుమార్, లాలం జనార్ధన్, లాలం మల్లికార్జున, లాలం ప్రవీణ్, తాళ్లూరి నాగరాజు, రామ్ పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యులు

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

కొత్తపల్లి: పౌష్టికాహారం, వ్యాయామంతో వ్యాధులు దూరమవుతాయని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం ఉండటంతోపాటు ఆకలి మందగించడం, బరువు తగ్గడం అలసట, ఛాతిలో నొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కేంద్రంలో గల్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధుల పట్ల, వ్యకిగత పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగ, మెడిటేషన్, వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ మల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న టీబీ సూపర్ వైజర్

రికార్డులను పకడ్బందీగా నిర్వహించండి

- డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి



సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ సీఈఓ

జూపాడుబంగ్లా: ఎంపీడీఓ కార్యాలయ నిర్వహణకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలును పటిష్టంగా చేపట్టాలన్నారు. దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ, పీ4 సర్వే తదితర పథకాల సర్వేలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో మండలాన్ని మొదటి స్థానంలో ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ ఉన్నారు.

పుట్లూరులో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

కృష్ణగిరి: అన్నదమ్ముల కుటుంబాల మధ్య పొలాల విషయంలో మండలంలోని పుట్లూరు గ్రామంలో జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పరి మౌలాలి, ఉప్పరి నరసింహుడు అన్నదమ్ములు. వీరిలో ఉప్పరి నరసింహుడు కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తి విషయంలో ఇరు కుటుంబాల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం కూడా పొలాల విషయంలో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం జరగగా గ్రామస్తులు కలుగజేసుకుని నచ్చజెప్పారు. రాత్రి మరో మారు కొడవళ్లు, రాడ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. ఇందులో ఓ వర్గానికి చెందిన ఉప్పరి మౌలాలి, మరో వర్గానికి చెందిన గౌరమ్మ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే వీరేశేఖర్, గిడ్డయ్యతోపాటు మరి కొందరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చెరుకుని గాయపడిన వారిని వెంటనే 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో మరో మారు ఘర్షణ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



దాడిలో తీవ్రంగా గాయపడిన ఉప్పరి మౌలాలి



తలకి గాయమైన ఉప్పరి గౌరమ్మ

కోలుకోలేక విద్యార్థి మృతి

జూపాడుబంగ్లా: నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థి జనార్దన్ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. తరిగోపుల గ్రామానికి చెందిన భూశయ్య, సావిత్రి దంపతుల పెద్ద కుమారుడు జనార్దన్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. ఈనెల 23న పాఠశాల వదిలిన అనంతరం బస్టాండుకు నడుచుకుంటూ వెళ్తుండగా జనార్దన్‌ను ట్రాక్టర్ ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావటంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు.



జనార్దన్(ఫైల్)

న్యాయవాదులను నియమిస్తాం

నందికొట్కూరు: న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు కోర్టు న్యాయవాదులను నియమిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి అన్నారు. మంగళవారం పట్టణంలోని సబ్ జైల్‌ను జడ్జి తనిఖీ చేశారు. భోజన వసతుల గురించి ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు.

మహిళ అదృశ్యం



లక్ష్మీదేవి (ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (39) అదృశ్యమైనట్లు ఎస్ఐ రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 26న వ్యక్తిగత కారణాల వల్ల ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, సన్నిహితుల వద్ద విచారించిన ఆచూకీ లభించలేదు. భర్త కాశీవిశ్వనాథ్ ఆచారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 91211 01166, 91211 01176 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథమ్యాటిక్స్, కామర్స్, కంప్యూటర్, సైన్స్ బోధించేందుకు(గెస్ట్ ఫ్యాకల్టీ) సెప్టెంబర్ 1లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సంబంధిత పీజీ సబ్జెక్టులో 55 శాతం మార్కులు ఉండి నెట్ లేదా సెట్ పాస్ అయినవారు అర్హులన్నారు. పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

'డుమ్మా' డాక్టర్!

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులకు హాజరుకాని డాక్టర్
- నాలుగు వందల మంది రోగులు.. ఇద్దరే డాక్టర్లు



వెలుగోడు సామాజిక ఆరోగ్య కేంద్రం

వెలుగోడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఓ వైద్యుడి తీరు విమర్శలకు తావిస్తోంది. విధులకు ఎప్పుడు హాజరవుతారో కూడా తెలియని పరిస్థితుల్లో రోగులకు వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెలుగోడు పట్టణ జనాభా 40 వేల పైనే. ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు గత ప్రభుత్వంలో సుమారు రూ.6 కోట్ల నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అధునాతన వసతులతో చక్కదిద్దారు. అన్ని రకాల మందులు, అత్యవసర చికిత్సలు అందించే పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. అయితే ఈ ఆసుపత్రిని ప్రస్తుతం సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో 7గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఒక వైద్యుడు రాత్రి డ్యూటీ చేస్తే, ఇద్దరు వైద్యులే ఆసుపత్రికి దిక్కు. ఒక డాక్టర్ జనరల్ సర్జన్ ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించ లేదు. మరో లేడీ డాక్టర్ మెటర్నిటీ సెలవులో ఉన్నారు. ఇంకో డాక్టర్ నంద్యాల జిల్లా మంత్రి బంధువు కుమారుడు. దీంతో ఆయన నంద్యాల ఆసుపత్రిలో మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు విధులు నిర్వహించే విధంగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కానీ వెలుగోడు ఆసుపత్రిలో ఒక్క రోజు కూడా విధులు నిర్వహించలేదనే ఆరోపణలున్నాయి. మరో డాక్టర్ పండగ సెలవు తీసుకున్నారు. లేడీ డాక్టర్ రాత్రి డ్యూటీ చేయడంతో మరుసటి రోజు రాలేరు. ఇద్దరు డాక్టర్లు మంగళవారం విధులకు వచ్చారు. ఓపీ చూస్తే సుమారు రెండు వందల నుంచి నాలుగు వందల మంది రోగులు చికిత్స కోసం వచ్చారు. భారీగా వచ్చిన రోగులతో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది.



వైద్యం కోసం వచ్చిన రోగులు

బాల్య వివాహాలు అనర్థదాయకం

- జిల్లా న్యాయ సేవాసంఘం కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

ఆత్మకూరు రూరల్: బాల్య వివాహాలు అనర్థదాయకమని జిల్లా న్యాయ సేవాసమితి కార్యదర్శి, సబ్ జడ్జి లీలా వెంకట శేషాద్రి అన్నారు. జిల్లా న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో కొట్టాల చెర్వులో మంగళవారం ఏర్పాటు చేసిన 'న్యూమాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్'లో ఆయన మాట్లాడారు. సమాజంలో అభివృద్ధికి విద్య ప్రధానమైనదన్నారు. విద్య ద్వారా వివేకం, వివేకం వల్ల అభ్యున్నతి కలుగుతుందన్నారు. అంతకు ముందు ఆయన వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం బాల్య వివాహాలను అరికడతామని అధికారులు, కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ శివప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ స్వప్న, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ ఉమర్, సీఐలు సురేష్‌కుమార్ రెడ్డి, రాము, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, సర్పంచ్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సబ్ జడ్జి లీలావెంకట శేషాద్రి

తూతూ మంత్రంగా సదస్సు

కొట్టాల చెర్వు గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా న్యాయవిజ్ఞాన సదస్సు తూతూ మంత్రంగా జరిగింది. సదస్సులో చెంచు గిరిజనులకు అవగాహన కల్పించడం పక్కన పెట్టిన అధికారులు తమ ప్రజ్ఞాపాటవాలను జడ్జి ఎదుట ప్రదర్శించేందుకు తహతహలాడారు. ఓ అధికారి ఆంగ్ల ప్రసంగంతో జిల్లా అధికారులను మెప్పించే పనిలో పడగా సదస్సుకు హాజరైన చెంచు గిరిజనులు మాత్రం తలగోక్కున్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు



చెంచులకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

నందికొట్కూరు: బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులపై చట్ట పరమైన చర్యలు తప్పవని న్యాయవాది మద్దయ్య హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని చెంచు కాలనీలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో ఆడపిల్లలకు వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. చిన్న వయస్సులో గర్భధారణ వల్ల గర్భస్రావాలు జరిగి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలన్నారు. సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు శోభారాణి పాల్గొన్నారు.

తెలుగు గంగలో వ్యక్తి గల్లంతు?



గల్లంతైన షరీఫ్

ఆళ్లగడ్డ: అహోబిలం సమీపంలో తెలుగుగంగ కాలువలో పడి షరీఫ్ (35) గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. షరీఫ్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కొంతసేపు తెలుగుగంగ కాలువ గట్టుపై కూర్చుంటానని చెప్పి కుటుంబ సభ్యుల సహాయంతో అక్కడికి చేరుకొని కాలువ గట్టుపై కూర్చున్నాడు. కొంత సేపటి తర్వాత వారి ఇంటికి వెళదామని పిలవగా మీరు వెళ్లిరండి నేను మరికొంత సేపు ఇక్కడే ఉంటానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. తర్వాత వచ్చి చూడగా షరీఫ్ కనిపించలేదు. చేతి కర్ర అక్కడే పడి ఉంది. దీంతో షరీఫ్ జీవితంపై విరక్తి చెంది కాలువలో దూకాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కాలువ వెంట గాలింపు చేపట్టారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

పగిడ్యాల: ఎరువులు, పురుగు మందులను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయాధికారి మురళీధర్ దుకాణాదారులను హెచ్చరించారు. మండలంలో మంగళవారం 2వ రోజు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు కొనసాగాయి. నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామాల్లోని సత్యసాయి, శ్రీరామ ట్రేడర్స్, సాయి తేజ, మురళీకృష్ణ, రసాయనిక ఎరువుల దుకాణాల్లో వారు తనిఖీ చేశారు. ఏఎస్ఓ ఎల్లగౌడు, ఏఎస్ఐ సుబ్బారావు ఉన్నారు.

- **పాములపాడు:** మండలంలోని జూటూరు గ్రామంలో తహసీల్దార్ సుభద్రమ్మ, మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి, ఎస్ఐ సురేష్‌బాబు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. శ్రీరామ ఆగ్రో ఏజెన్సీస్, సాయిబాబా ఆగ్రో ఏజెన్సీస్, గాయత్రీ సీడ్స్ దుకాణాల్లో ఫర్టిలైజర్ లైసెన్స్, స్టాక్ రిజిస్టర్లు, ఈ పోస్ నమోదు, ప్రస్తుత ఎరువుల నిల్వలను సరిచూశారు. బిల్లు బుక్కులు, రశీదులు పరిశీలించారు. రైతులకు ఎమ్మార్పీకి మించి విక్రయించరాదని, కొనుగోలు చేసిన ప్రతి ఎరువుల బస్తా, రసాయన మందులకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని ఆదేశించారు. వారి వెంట ఆర్ఐ ఖాజాబీ ఉన్నారు.



పగిడ్యాలలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

- **బండిఆత్మకూరు:** మండలంలోని ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాల్లో తహసీల్దార్ పద్మావతి, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఎస్ఐ జగన్మోహన్ తనిఖీలు నిర్వహించారు. ఈర్నపాడు గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి ఏజెన్సీ, అనుపమ ఫర్టిలైజర్స్, బండిఆత్మకూరులోని ఓంకారేశ్వర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, దుర్గభవాని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. యూరియాను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- **మహానంది:** ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. గాజులపల్లెలోని గఫారియా, దీప్తి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాల్లో ఏఓ నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.
- **వెలుగోడు:** అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణాలు సీజ్‌చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఎరువుల దుకాణాలను ఏఓ స్వాతి, ఎస్ఐ సురేష్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, అనుమతి పత్రాలు పరిశీలించి సిబ్బందికి, దుకాణ యజమానులకు సూచనలిచ్చారు.